క్లుప్తంగా

ఘనంగా ఎథ్నిక్ డే సంబరాలు


సాంప్రదాయ వేషధారణల్లో విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎథ్నిక్ డేను ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించారు. వివిధ ప్రాంతీయ సంస్కృతులను ప్రతిబింబించే నృత్యాలు, పాటలు, ఫ్యాషన్ ప్రదర్శనలు, రంగోలి పోటీలు, వివిధ ప్రాంతాల వంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కళాశాల కరెస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు మాట్లాడుతు ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, సాంస్కృతిక అవగాహన, పరస్పర గౌరవభావాలను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఆర్ విద్యా సంస్థల మానేజ్‌మెంట్ సభ్యుడు కొండా హరి రామ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, ఎంబీఏ హెచ్‌వోడీ కేవీ శ్రీధర్, కోఆర్డినేటర్లు ఇ.కవిత, ఎ.శ్రీ లాస్య, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రమేష్ మృతికి సంతాపం


రమేష్ మృతికి సంతాపం తెలుపుతున్న జేపీ

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్ మేనమామ పంది రమేష్ మృతిచెందారు. ఆయన మృతదేహం వద్ద పూలమాలలు వేసిన వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. పార్టీ నాయకులు జగదీష్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మీ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నల జాన్ గురునాథ్, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, నగర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, స్థానిక పార్టీ నాయకులు రమేష్ మృతికి సంతాపం తెలిపారు.

సభల జయప్రదానికి పిలుపు

కుక్కునూరు: సీఐటీయూ అఖిల భారత మహాసభలు 2025 డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్రీడాకారులను వెంటాడుతున్న సమస్యలు

ఏళ్లతరబడి శిక్షకులు, గ్రౌండ్స్‌మెన్స్ పోస్టులు ఖాళీ

ఏలూరు రూరల్ : ఏలూరులో క్రీడాకారులను సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థపై క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి కోచ్‌ల నియామకం చేపట్టకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. స్టేడియంలో మౌలిక వసతులు, అభివృద్ధి, క్రీడల శిక్షణ గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం పిల్లలు ఆడుకునేందుకు బాల్స్ ఇచ్చే నాధుడే లేడంటున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే ఆట స్థలాలు బురదమయమైతే క్రీడాకారులు సొంతగానైనా ఎలా సాధన చేస్తారంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కానరాని కోచ్‌లు

గతంలో ఏలూరులో 10 మందికి పైగా శిక్షకులు పని చేశారు. ఫలితంగా స్టేడియంలు క్రీడాకారులతో కళకళలాడేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొన్నేళ్లుగా వాలీబాల్, కబడ్డీ, హాకి, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడల్లో పిల్లలకు శిక్షణ ఇచ్చే కోచ్‌లే లేరు. ఇప్పుడు స్విమ్మింగ్ కోచ్ పోస్ట్ సైతం ఖాళీ అయ్యింది. ఈ క్రీడాంశాల్లో సాధన చేస్తున్న పిల్లలకు కొత్త బాల్స్ ఇచ్చే నాధుడే కానరావడం లేదు. అరిగిన బాల్స్‌తోనే సీనియర్ క్రీడాకారులు పిల్లలకు ఆట నేర్పుతున్నారు. కోచ్‌లు లేకపోవడంతో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ గ్రౌండ్స్ కనుమరుగయ్యాయి. మరోపక్క లక్షలాది రూపాయలతో చేపట్టిన హ్యాండ్‌బాల్ కోర్టు నేటికీ పూర్తిస్థాయిలో అభివృద్ధి కాలేదు. వర్షాకాలంలో గ్రౌండ్ పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిపోతుంది. గత్యంతరం లేక పిల్లలే గ్రౌండ్ బాగు చేసుకుని సాధన చేస్తున్నారు.


ఏఎస్‌ఆర్ స్టేడియంలో కోచ్ లేకపోయినా సాధన చేస్తున్న పిల్లలు


ఇండోర్ స్టేడియంలో చిరిగిన ఫుట్‌బాల్ పోస్ట్ నెట్

గ్రౌండ్స్‌మెన్ లేరు

స్టేడియంలో పని చేసిన ఇద్దరు గ్రౌండ్స్‌మెన్స్ కొన్నేళ్ల క్రితమే రిటైరయ్యారు. వారిస్థానంలో నేటికీ ఒక్క గ్రౌండ్‌మెన్‌ను కూడా అధికారులు నియమించలేదు. దీంతో గత్యంతరం లేక బాలబాలికలే ఆట స్థలాలను శుభ్రం చేసుకోవల్సిన దుస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే ఏఎస్‌ఆర్ స్టేడియం రన్నింగ్ ట్రాక్ చిత్తడిగా మారిపోతుంది. అధికారులు వర్షం కురుస్తున్న రోజుల్లో స్టేడియంకు తాళాలు వేస్తున్నారు. కోచ్‌లు, గ్రౌండమెన్స్ నియామకంపై డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. ప్రస్తుతం ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ స్కేటింగ్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో కోచ్‌లు శిక్షణ అందిస్తున్నారని తెలిపారు.

కనీస వసతులు కరువు

క్రీడాకారులు, వాకర్స్ సౌలభ్యం కోసం గతంలో స్టేడియం పరిసరాల్లో నిర్మించిన మరుగుదొడ్డి సైతం కంపుకొడుతోంది. ఆకతాయిలు దొడ్డి తలుపులు విరగ్గొట్టడంతో, దీనిని ఉపయోగించేందుకు బాలికలు భయపడుతున్నారు. కొన్నిసార్లు వాటర్, కరెంట్ సరఫరా లేకపోవడంతో మరుగుదొడ్డి ఉపయోగించుకోలేక పోతున్నామని క్రీడాకారులు వాపోతున్నారు. ఇక నగరం నడిబొడ్డున ఉన్న స్టేడియంలో సురక్షిత తాగునీరు క్రీడాకారులకు అందని ద్రాక్షగా మారింది.

అధికారుల నిర్లక్ష్యం



ఏలూరులో స్టేడియం రానురాను తీసుకట్టుగా మారిపోతుంది. కోచ్‌ల నియామకం పట్ల ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి స్టేడియం కట్టి వదిలేస్తే సరిపోతుందా? శిక్షకులు లేకుండా పిల్లలు ఆటలు ఏలా నేర్చుకుంటారు? పోటీల్లో పతకాలు ఏలా సాధిస్తారు. మారుతున్న కాలానుగుణంగా క్రీడాకారులు, నగర ప్రజలు అవసరాల కోసం స్టేడియంలో లైట్లు, మౌలిక వసతులు ఏర్పాటుచేయాలి.

– ఎండీ సుభాని, వాకర్

కోచ్‌లు లేని స్టేడియం ఎందుకు?



గతంలో బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోచ్‌లు శిక్షణ ఇవ్వడం వల్లే స్టేడియం క్రీడాకారుల సాధనతో కళకళలాడేది. క్రమం తప్పకుండా శిక్షణ తరగతులు, పోటీలు జరిగేవి. ఏళ్ల తరబడి కోచ్‌లు లేకపోవడంతో పిల్లలు స్టేడియానికి రావడం మానేశారు. కోచ్‌లను నియమించి శిక్షణ ఇవ్వాలి. ఆటలను అభివృద్ధి చేసి, లైట్లు ఏర్పాటుచేసి, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలి.

– ఎస్ సత్యనారాయణ, సీనియర్ ప్లేయర్

కానిస్టేబుళ్లుగా హోంగార్డులు


కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని అభినందించిన ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: హోంగార్డులుగా పోలీస్ శాఖలోకి ప్రవేశించి కానిస్టేబుల్స్‌గా ఎంపికయిన నలుగుర్ని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. వారిని ఘనంగా సత్కరించారు. కానిస్టేబుళ్లుగా ఎంపికన వీరంతా ఎస్పీని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హోంగార్డులైన పి.శ్రీనివాస్ విజయ్‌కుమార్, బి.సంజయ్, కొల్లి శ్రీదేవి, ఎన్‌వీ శ్రీనివాసరావు ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలకు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. వీరికి జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలకు చేరేందుకు ఒక లక్ష్యం కలిగి ఉండాలన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్స్ ఆపరేట్, కంప్యూటర్ స్కిల్స్, సీడీఆర్ అనాలసిస్ తదితర అంశాలపై ఆసక్తితో వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ శివకిషోర్ వారికి సూచించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, పోలీస్ అధికారులు ఉన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


పత్తేబాద కనకదుర్గమ్మ


పవర్‌పేట అన్నపూర్ణ


బావిశెట్టి వారిపేట కనకదుర్గాంబ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల 5వ రోజు శుక్రవారం అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

టి.నరసాపురం: ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఎస్సై ఎం.జయబాబు సూచించారు. టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జయబాబు మాట్లాడూ ప్రాణం విలువైందని, ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతులు గెలలు కోసే సమయంలో అవసరం చేరకు లైన్ క్లియరెన్స్‌లను సిబ్బంది రైతుల కోరిక మేరకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ బాజీ, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, లైన్‌మెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	40	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	38
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	40	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	44
బీరకాయలు	36	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ


బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	19

అంబికాదేవి సేవలో జేపీ


అంబికాదేవిని దర్శించుకుంటున్న నాయకులు

ఏలూరు టౌన్: దసరా మహోత్సవాల్లో భాగంగా ఏలూరు సత్రంపాడు అంబికాదేవి ఆలయ ధర్మకర్త అంబికా రాజా ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అంబికాదేవిని దర్శించుకుని పత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంబికాదేవి ఆశీస్సులు ఏలూరు నియోజకవర్గం ప్రజలపై ఉండాలని, అందరికీ మంచి జరగాలని జేపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, నెరుసు చిరంజీవి, మున్నల జాన్‌గురునాథ్, తుమరాడ స్రవంతి, కంచుమర్తి తులసీ, దాలి వెంకటేష్, ఏసుపాదం, మహేష్, కొల్లిపాక సురేష్, అనిల్, జగదీష్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


శ్రీకాకుళం సత్యనారాయణను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు విసుగు చెంది లక్కవరం గ్రామానికి చెందిన సుమారు 20 మంది శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు సమక్షంలో లక్కవరం గ్రామానికి చెందిన వడ్డెర సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీకాకుళం సత్యనారాయణ, సుమారు 20 మందితో కలిసి పార్టీలో చేరారు. వీరికి జెట్టి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సత్యనారాయణ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించి, ధైర్యాన్ని నింపారన్నారు. కార్యక్రమంలో లక్కవరం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిల్లా దుర్గారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, చిట్టిబొమ్మ శివరామకృష్ణ, చల్లా రామకృష్ణ, నిమ్మ రామకృష్ణ, జీరి పాపారావు, నంబూరి బ్రహ్మం, యంట్రపాటి శివాజీ, ఆళ్ల సత్యనారాయణ, ఎంపీపీ కొదమ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ఘనమైనవి


నాగరాజన్‌కు పురస్కారం అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : కూచిపూడి నాట్య రంగానికి నగరానికి చెందిన కేవీ సత్యనారాయణ చేసిన సేవలు ఎంతో ఘనమైనవని అతిథులు ప్రశంసించారు. శుక్రవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో హిందూ యువజన సంఘం, కేవీఎస్ ట్రస్ట్, సంయుక్త ఆధ్వర్యంలో కేవీఎస్ పురస్కారం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సత్యనారాయణ ఏలూరు పరిసర ప్రాంతాలతో పాటు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో స్థిరపడిన అనేక మంది తెలుగు ప్రజలకు కూచిపూడి నృత్యాల్లో శిక్షణ అందిస్తు, ఆ నృత్య కళను ప్రపంచ వ్యాప్తం చేయడంలో విశేష కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన ప్రముఖ మేలట్టూరు భాగవత మేళ కళాకారులు ఎస్ నాగరాజన్, ఎస్ అరవింద్ సుబ్రహ్మణ్యంలకు కేవీఎస్ ప్రతిభా పురస్కారం ప్రదానం చేసి, వారికి వెండి కిరీటం, రూ.10 వేల నగదు, జ్ఞాపిక, శాలువాలు అందచేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష కుమార్ యాదవ్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఏపీ టీకే కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, యర్రా సోమలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ కేవీఎస్ ట్రస్ట్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ఆధునిక వైద్య పరికరాల ప్రారంభం


వైద్య పరికరాలను ప్రారంభిసస్తున్న ఎంపీ, కలెక్టర్

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రికి గెయిల్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందించిన రూ.1 కోటి విలువైన ఆధునిక వైద్య పరికరాలను ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రికి రోగులు ఎలాంటి విషమ పరిస్థితుల్లో వచ్చినా విజయవాడ వంటి ప్రాంతాలకు రిఫర్ చేసే పరిస్థితి రాకుండా వైద్యచికిత్సలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గెయిల్ సంస్థ అందించిన వైద్య పరికరాల ద్వారా ప్రతినెలా 300 ప్రసవాలు, 150 సర్జరీలు, 1500లకు పైగా రక్తపరీక్షలు అదనంగా ప్రజలకు అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గెయిల్ సంస్థ ప్రతినిధులు నారాయణ, ప్రభాకర్, హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు, డీఎంహెచ్‌ఓ పీజే అమృతం, డీసీహెచ్‌ఎస్ పాల్‌సతీష్, వైద్యులు, అధికారులు ఉన్నారు.

అడుగుకో గుంత.. ఆదమరిస్తే చింత


పాతూరు నుంచి సూరప్పగూడెం వైపుగా గుంతల్లో వెళుతున్న ఆటోలో ప్రయాణికులు

భీమడోలు: సూరప్పగూడెం, పాతూరు గ్రామాల మధ్య రెండు జాతీయ రహదారులను కలుపుతూ రైల్వే ట్రాక్ ఆనుకుని ఉన్న రోడ్డు వర్షాలకు ఛిద్రంగా మారింది. దీంతో భారీ గుంతలతో రోడ్డుపై నడకే కష్టంగా ఉండడంతో ఇక ఆటోలు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు రెండు కిలోమీటర్ల మేర భయం భయంగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రోడ్డు అంటేనే ప్రయాణికులు వణికిపోతున్నారు. కూటమి పాలనలో గుంతలను పూడ్చకపోవడంతో ఈ వర్షాలకు ఇంతై, ఇంతింతై, వటుడింతై అన్న చందంగా ప్రమాదకరంగా మారాయి. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని సూరప్పగూడెం, పాతూరు గ్రామాలు రెండు జాతీయ రహదారుల మధ్య ఉన్నాయి. రెండు గ్రామాలను కలిపే జెడ్పీలోని పీఐయూ (పంచాయతీరాజ్ ఇంప్లిమెంటిక్ యూనిట్) రోడ్డు పాతూరు రైల్వే ట్రాక్ మీదుగా రాకపోకలు సాగించాలి. అయితే ఈ రోడ్డు కొన్నేళ్లుగా అధ్వానంగా మారడంతో ఈ గ్రామాల రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు రైల్వే గేటు మరమ్మతుల నేపథ్యంలో ప్రత్యామ్నయంగా ఈ రోడ్డు వెంబడి భారీ వాహనాలు ప్రయాణిస్తుండడంతో చిన్న గుంతలు పెద్దగా మారి ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. పలు గ్రామాల ప్రజలు భీమడోలు జంక్షన్‌కు వెళ్లాలంటే ఈ రహదారిని వినియోగిస్తున్నారు. గుంతల్లో ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు పడి గాయాల పాలవుతున్నారు. పాతూరులోని వ్యవసాయ భూములకు వెళ్లే రైతులు ఈ రోడ్డుపై పగలు, రాత్రి ప్రయాణిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు నరకానికి ఆనవాళ్లుగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాయామ కళాశాలలో ఆర్చరీ పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ నతానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు అధ్యక్షతన శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమహేంద్రవరం పరిధిలోని అంతర్ కళాశాలల మధ్య ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి టోర్నమెంట్ అబ్జర్వర్‌గా మేరీ సెలిన్‌రోజ్, ఫిజికల్ డైరెక్టర్, సెంట్ థెరిసా కాలేజ్ ఫర్ ఉమెన్, ఏలూరు, సెలెక్షన్ కమిటీ మెంబర్స్‌గా అంజద్ అలీ, ఫిజికల్ డైరెక్టర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ చింతలపూడి శ్రీగోపాలకృష్ణ ఆర్చరీ అసోసియేషన్ సెక్రెటరీ, ఈస్ట్ గోదావరి పాల్గొన్నారు. ఈ పోటీల్లో పురుష, మహిళా విభాగాల్లో చింతలపూడి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ గెలుపొందింది. ఈ పోటీల నుంచి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి టీమ్‌ని సెలక్షన్ చేశారు. కార్యక్రమంలో దిలీప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రత్నబాబు, సూపరింటెండెంట్ పతంజలి జయ శ్రీ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అంకాలగూడెంలో స్వచ్ఛభారత్

కొయ్యలగూడెం: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో రైతులు భాగస్వామ్యం కావడం హర్షణీయమని వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్ పేర్కొన్నారు. శుక్రవారం అంకాలగూడెం గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛభారత్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తూనే పారిశుద్ధ్యాన్ని అమలు చేశారు. బోర్డు అధికారులతో పాటు రైతులు చెత్తని ఏరువేస్తూ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. కార్యక్రమంలో రైతు నాయకులు గంటా రాంబాబు, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు, ధూళిపూడి బాబురావు, జి.భద్ర, టి.నాని, సర్పంచ్ కడకట్ల గడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

కామవరపుకోట: తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి సహకరించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జంగారెడ్డిగూడెం డీఎల్‌డీవో ఎం.రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సీఆర్‌పీల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, ద్వారకాతిరుమల మండల సీఆర్‌పీలు శిక్షణకు హాజరయ్యారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో సుబ్బారాయన్, కామవరపుకోట ఎంపీడీఓ సరళ కుమారి, డీపీఆర్సీ జిల్లా కో- ఆర్డినేటర్ ప్రసంగిరాజు, రంగ నాయకమ్మ, సర్పంచ్ కె.అనూష, ఉప సర్పంచ్ రంగబాబు, పంచాయతీ కార్యదర్శి వి.రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు కలిసి ఈ విద్యా సంవత్సరం కళాశాలలో చేరిన నూతన విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, ఇందిరా కుమారి, ఎం.ఉషారాణి పాల్గొన్నారు.

నేడు ఫాసిజం వ్యతిరేక సభ

కొయ్యలగూడెం: ఫాసిజానికి వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. 27వ తేదీ జంగారెడ్డిగూడెం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న ఫాసిజం వ్యతిరేక సదస్సుకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం కన్నాపురం రోడ్డులోని కార్యాలయం వద్ద నిర్వహించారు. మాదేపల్లి వెంకటరత్నం, అర్జ ధర్మారావు, మడకం రామన్న, మందలపల్లి రాజు, డి.సంసోను, జి.నాగమణి, బి.బద్రి, పి.నాగమణి, పి.దుర్గా తదితరులు పాల్గొన్నారు.